కథ

# నల్లటి వెలి

దాట్ల దేవదానంరాజు



పోశయ్య వొంటిమీద గోచీ వొకటే వుంది. సాయంత్రం నుంచీ అలసిన పందిలా రొప్పుతున్నాడు. బురదలో జలకాలాడి వొళ్లంతా చీదరెక్కినట్లు తైతక్కలాడుతున్నాడు.

పోశయ్యకు ఆరోజే పందిని అమ్మిన సొమ్ములు చేతికందాయి. జేబుతో బాటు నరాలూ లాగేస్తున్నాయి. వాడి పెళ్లాం లోవతల్లి ఇక ప్రేక్షకురాలే. ఎదిగిన ఇరవైఏళ్ళ కొడుకు సింహాచలం తండ్రికేసి భయంగా చూస్తున్నాడు. పోశయ్య తాగితే మనిషికాడు.

గుడిసె ముంగిట మదకర్రలతో కట్టిన పందుల దొడ్డి ఎస్కిమోల ఇగ్లూలా వుంది. అందులోంచి పంది పిల్లలు కీచుకీచుమని రాగాలు తీస్తున్నాయి. మధ్యమధ్య తల్లి పంది గుర్‌మని వాయిద్య సహకారం అందజేస్తున్నది. పరిసరాలు సాధ్యమైనంత శుభ్రంగానే వుంచుతుంది లోవతల్లి.

పోశయ్య తనలో తాను గొణుక్కుంటున్నాడు. ఆర్పి దాచుకున్న సగం కాలిన చుట్టను మళ్ళీ వెలిగించాడు. ఉన్నట్టుండి లేచి చుట్టూ పరకాయించి చూసాడు. తుండుగుడ్డను ఒక్కసారి విదుల్చుకుని తలపాగలాగ చుట్టుకున్నాడు. ఇంకా చీకటి పడలేదు. చంద్రుడు మాత్రం వచ్చేసాడు.

"ఇప్పుడే వత్తాను. వుండండహేయ్" అంటూ ముందుకు అడుగేసాడు.

లోవతల్లి గుండె గుభేలుమంది.

"ఒరయ్యోయ్, నువ్వెక్కడికీ వెళ్లొద్దురా" సింహాచలం అడ్డుకున్నాడు.

పోశయ్య "అడ్డు లెగహేయ్... ఎదవ నా కొడుకా..." అంటూ గిజాయించుకుని వెళ్ళిపోయాడు.

"ఈ నా రాకాసోడుఈవేళ ఏం చేత్తాడో దేవుడోయ్. డబ్బులు దండిగా జేబులో పడ్డాయి. మనమాట యిక వినడురా, తండ్రీ. మన శోకాండాలు వాడ్ని కదలించవురోయ్, కొడుకా" లోవతల్లి ఏడుపు మొదలెట్టింది.

"ఊరుకోవే వోలమ్మా... ఏదో జరిగిపోయిందని మనోళ్లు పరుగెట్టుకొత్తారు. ఊరుకోవే" సింహాచలం అంటున్నాడు.

వారంరోజులుగా ఆ యింట్లో ఎవరికీ కంటిమీద కునుకులేదు. ఒకటే గుబులు. సర్కారు వారు పందుల సంచారం పట్ల కనిపిస్తే కాల్చివేత ఆర్డరు ఇచ్చినట్లు ఊళ్లో కెళ్ళిన పందుల్ని చంపేస్తున్నారు. పందుల్ని బంధించి ఇంటిల్లపాదీ కాపలా కాస్తున్నారు. అలవాటైన ప్రాణులు దౌడుతీసి చావు తెచ్చుకుంటాయేమోనని వంతులవారీగా కనిపెట్టుకుని చూసుకుంటున్నారు.

మామూలు రోజుల్లో పందుల్ని పొద్దుటే విడిచిపెట్టేవారు. గ్రామంలోని అశుద్ధాలన్నీ ఒక గంటలో మాయమైపోయేవి. ఊరి పొలిమేరకు పరిశుభ్రంగా మారిపోయేవి. మళ్లీ వాటన్నిటినీ తోలుకొచ్చి పందుల దొడ్డిలోకి విడిచేవారు.

ఆకాశంలో పండు వెన్నెల విరగకాస్తూంది. చంద్రుడు రైలుపట్టాపై సాగిన నాణెంలా పెద్దదిగా కనిపిస్తున్నాడు. పందులదొడ్డిలో పందులన్నీ ఉల్లాసంగా ఉన్నాయి. వెన్నెల్ని ఆస్వాదిస్తూ ఘీంకారాలు చేస్తున్నాయి. పోశయ్య ఇంకా రాలేదు.

దిబ్బమీద కూర్చుని లోవతల్లి మొగుడికోసం ఎదురుచూస్తూంది. సింహాచలం అన్నం తినేసి పడుకుందామని గుడిసె మూలకు పోయాడు. దుప్పటి తీసుకుని నిద్రకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు.

పోశయ్య రాలేదు.

లోవతల్లి మనస్సు పరివిధాలుగా పోయింది. మొగుడు తిరంగా లేకపోయినా కచ్చా పోసుకుని కర్రచేత పట్టుకుని పందుల్ని ఊరంతా తనే తిప్పేది. అమ్మోళ్ల ఇంటి దగ్గరున్నప్పట్నుంచి పందులంటే లోవతల్లికి ఎంతో ప్రేమ. తన వాళ్లంతా పందుల పెంపకంలోనే సేదతీరేవారు. కాసిన్ని మెతుకులు నోట్లో పడేది ఈ పందులవల్లే అని వాటి పట్ల ఎంతో అభిమానంగా ఉండేవారు. పందుల్ని పెంచడం తప్ప మరో లోకం లేదు వాళ్లకు. కులవృత్తి వదులుకుంటే పుట్టగతులుండవని పుట్టింట్లో తాత తత్వాలు పాడేవాడు.

తనకి పందుల వీరావేశం తెలుసు. వాటి కసి ముందు మనిషి నిలబడలేదు. పెద వెంకన్నగాడి బాలింత పంది చెంబెట్టుకుని బయలుకి వెళుతున్న రాముడి మీద పడి చీరేసింది. అప్పటికిగానీ ఊళ్లో ఎవరికీ పంది కోపం తెలియలేదు. పాపం రాముడు ఆస్పత్రులంటా తిరిగి ప్రాణాలు దక్కించుకున్నాడు.

పోశయ్య ఇంకా రాలేదు.

"దొంగ సచ్చినోడు వస్తేగానీ నేనూ వణ్ణం తినను" అనుకుంది లోవతల్లి.

నిజానికి లోవతల్లి వంట్లో బాగోలేదు. జ్వరం తగిలినట్లుగా వొళ్లంతా వేడిగా కాలిపోయింది. అదేపోతుందిలే అని ఆచార్యులుగారి దగ్గరకు వెళ్లలేదు. సాయంత్రం అయ్యేటప్పటికి కొంచెం నిమ్మళించినట్లుగా వుంది.

లోవతల్లి ఆలోచన్లు పోశయ్య మీదకు పోయాయి. "మావ చాలా మంచోడు. అయితే ఒఠ్ఠి దరిద్రగొట్టు సన్నాసి. తాగితే మెకంలా నాలుగు కాళ్ళతో గెంతులేస్తాడు"

మొన్నామధ్య జరిగిన సంఘటన గుర్తకొచ్చింది. ఊరి చివర తొట్టి దగ్గర రామవరం వాళ్లతో పంది పందెం కాసుకున్నారు. ఎరకుల్లందరూ గోచీలెట్టుకుని సాగదీసిన మీసాలు దువ్వుకుంటూ తొడలు చరచుకుంటూ అరచుకుంటూ వీరంగం చేసేసారు. పంది పందెం కొత్తగా అనిపించి ఊరంతా చోద్యం చూడటానికి వచ్చినట్లు వచ్చారు. ఆవేళ పోశయ్య వుషారు చూడాల్సిందే. తాగి శివాలెత్తినట్లు కలియతిరిగాడు. ఇంతాచేసి పందులు మోగలేదు. జనం నిరాశపడి తిట్టుకుంటూ పోయారు. అవి రక్తాలు చిమ్ముకుంటే చూడాలని ఈ మనుషుల ఆశ.

పోశయ్య ఇంకా రాలేదు.

లోవతల్లి దిగులు పెరిగిపోయింది. సింహాచలం నిద్రట్లోకి జారుకున్నాడు.

లోవతల్లి లేచి వెళ్లి పందులు తాగడం కోసం దోనెలో మంచినీళ్లు పోసింది. పంది పిల్లలు తల్లి స్తన్యం కోసం గోలపెడ్తున్నాయి.

పోశయ్య వచ్చాడు, తూలుతూ తనలో ఏదో మాట్లాడుకుంటూ.

ప్రస్తుతం వాడిలోకం వాడిదే. పలకరిస్తే బదులు చెప్పడు. ఎర్రకళ్ళలోంచి నిప్పురాలుతూ వుంటుంది. కాండ్రించి ఉమ్మేసి బూతులు లంకించుకుంటాడు. కూడు తెచ్చి పోశయ్య దగ్గర పెట్టింది లోవతల్లి. పోశయ్య దృష్టి కూడుమీద లేదు. లోవతల్లి జాకెట్టులోకి కూరుకుపోయింది. పండు వెన్నెలకు కళ్ళు మరింత ఎరుపెక్కాయి. బుసకొడుతున్నట్లున్నాడు. "కూడు తర్వాత తింటాన్లే" అంటూ చెయ్యట్టుకున్నాడు. లోవతల్లి బేజారుమంది. విదిల్చుకుంది.

"బాబోయ్" అంటూ కేకలు వేసి పరుగెట్టింది. పోశయ్య వెనుకనుంచి తరుముకుంటూ వస్తున్నాడు. తూలుకుంటూ తిట్టుకుంటూ గొణుక్కుంటూ లోవతల్లి కోసం పరుగెడుతున్నాడు.

లోవతల్లి రైతులు ధాన్యం రాసులు కప్పెట్టిన చోటుకి పోయింది. అక్కడ ఊపిరి పీల్చుకుని నిలబడింది.

"అమ్మ సచ్చినోడు- గట్టిగా తాగితే దగ్గరికి చేరి వొళ్లు హూనం చేస్తాడు. ఇష్టం

మురికిజాతికదా మాది. మాకే మాయరోగాలు వస్తాయి. ఈలోకంలో మీరొక్కరే బతకండి. మమ్మల్ని చంపేయండి" ఆవేశంగా లోవతల్లి అంది.

మిగిలిన మగాళ్లంతా నిర్ఘాంతపోయారు.

నోటిమాట రాక మిన్నకుండిపోయారు. కలక్టరుగారు నిర్లిప్తంగా అలాగే చూస్తున్నారు. అటెండరు ముందుకెళ్ళబోతుంటే వారించారు.

"మీ నానాచెత్తా తిని ఇంటికి రాగానే తానం చేయిత్తాం. అపుడు చూడండి పంది ఎంత శుభ్రంగా వుంటుందో? తానం అయ్యాక పంది ఇక పెంట కూడ వెయ్యదు. లోకంలోని పందులన్నింటినీ చంపేసి బొమ్మల్లో చూసుకోండి. లేకపోతే ఆనక పాలరాతులతో పందుల్ని చెక్కుకుని మీరు పడుకునే గదుల్లో అందానికి పెట్టుకోండి. ఏ జీవం పని అదే చేయాలి. అలా కాకపోతే ఇంకా పుట్టని అనేక రోగాలు వత్తాయి. అపుడు మనుషులందరూ చత్తారు" లోవతల్లిని అడ్డుకోవడం ఎవరి తరమూ కావడం లేదు.

సింహాచలం "అమ్మా! ఊరుకోవే... ఊరుకోవే" అంటున్నాడు. పోశయ్య 'నోర్ముయ్, బజారుదానా' అంటూ కసురుకుంటున్నాడు.

లోవతల్లి ఒక్కసారిగా ఏడుపులోకి దిగిపోయింది. గొంతు బొంగుపోయి మాట్లాడుతూంది.

"బయటి లోకంలో మీరు చంపండి. ఇంటికాడ తాగి మా మొగుళ్ళు చంపుతారు. నిత్యమూ సావడమే మా బతుకు. మీరే వూరేగండి. మీరే ఏలండి. మేం కూడులేక సత్తుంటే ఆయిగా కులకండి" లోవతల్లి గొంతు జీరబోయింది. కలక్టరుగారు లేచి నిలబడ్డారు.

"నేను చెప్పవలసిందేమీ లేదు. సీమ పందుల్ని పెంచుకోడానికి అర్హులైన కొందరికి బ్యాంకుల ద్వారా లోను ఇప్పిస్తాను. నేను చేసే సహాయం అదే" స్థిరంగా అని కలక్టరుగారు లోపలికి వెళ్ళిపోయారు.

ధనరాజు ఏదో చెప్పడానికి ప్రయత్నించాడు. ఆయన వినలేదు.

ఉన్నట్టుండి లోవతల్లి దబ్బున నేలమీద పడిపోయింది.

చుట్టూవున్నవాళ్లు కంగారుపడ్డారు. ఏమైందంటూ ఆమె చుట్టూ మూగారు.

ఇంతలో ఎవరో గ్లాసుతో నీళ్ళు తెచ్చి ముఖంమీద చల్లారు.

సింహాచలం తల్లి తలను ఒడిలో పెట్టుకున్నాడు.

లోవతల్లి నీరసంగా కదిలింది.

ఆమె చూపులు వాడిగా వున్నాయి. ప్రశ్నలు కురిపించే కత్తుల చూపులవి.

ఒక్కుదుటన లేచింది.

చీర సర్దుకుంది. జుట్టు వెనక్కి లాక్కుంది. బిడ్డకు పాలు ఇవ్వడం కోసం తల్లిపడే ఆత్రుత ఆమెది.

ఆశ్చర్యంగా చూస్తున్న తనవాళ్లను దాటుకుని గబగబా ముందుకు అడుగులువేసింది.

ఇంటి దగ్గర పందిపిల్లలకు తాగేందుకు నీళ్ల పెట్టడం మరచిపోయింది లోవతల్లి. పరుగులాంటి నడకకు కారణం అదే.

*(కథ రాయమని ప్రోత్సహించిన మిత్రులు ఆకెళ్ళ రవిప్రకాష్ గారికి కృతజ్ఞతలతో)*

# ఎన్.ఎల్.పి కౌన్సిలింగ్ తీరుతెన్నులు!

కౌన్సిలింగ్ అంటే ఏమిటి? ఇన్‌ఫార్మల్ కౌన్సిలింగ్, ఫార్మల్ కౌన్సిలింగ్ అంటే ఏమిటి? అనే అంశాల గురించి గతవారం చర్చించుకున్నాం.

ఒక విద్యార్థి విషయంలో ఉపయోగించిన ఎన్.ఎల్.పి (న్యూరోలింగ్విస్టిక్ ప్రోగ్రాం) కౌన్సిలింగ్ పద్ధతిని మీకు వివరిస్తాను. 'మెటా మోడల్' టెక్నిక్‌తో కౌన్సిలింగ్ చేయడం జరిగింది. 'మెటా మోడల్' టెక్నిక్ అంటే ప్రశ్నించే విధానంతో కూడుకున్నది. ఏమిటి? ఎప్పుడు? ఎక్కడ? ఎవరు? ఎలా? ఇలాంటి ప్రశ్నలతో రూపుదిద్దుకున్న టెక్నిక్ 'మెటామోడల్' పద్ధతి.



పి.టి.సుందరం
న్యూరో సైకాలజిస్టు

క్లయింట్‌కు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగానూ, లోతుగానూ పరిశీలించేందుకు వీలుగా ఇందులో 'ఎందుకు?' అనే ప్రశ్నను ఉపయోగించడం జరగదు. ఎందుకు? అనే మాట ఫలానా ఫలానా కారణాల వల్ల అంటూ చాలారకాలుగా క్లయింట్ నుంచి సేకరించాలనుకున్న అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తుంది.

కేసు విషయానికి వద్దాం. అతని పేరు అంజయ్య. ఇంజినీరింగ్ కోర్సు పూర్తిచేశాడు. మానసికపరమైన సంఘర్షణ లో ఉన్నాడు. ఇంజినీరింగ్‌కోర్సును విజయవంతంగా పూర్తి చేశాడు. ఇప్పుడు అతని ముందు మూడురకాల అవకాశాలు ఉన్నాయి. ఒకటి ఎం.టెక్. ఎంట్రెన్స్‌కు అప్లయి చేయడం. రెండవ ఆప్షన్ ఉద్యోగప్రయత్నం చేయడం. మూడవది ప్రేమించిన అమ్మాయితో కులాంతరవివాహం చేసుకోవడం. అత్తగారింట ఇల్లరికం అల్లుడిగా ఉండిపోతే పెళ్ళి చేయడానికి అమ్మాయి తరపు వారికి ఎలాంటి అభ్యంతరం లేదు. వీటన్నింటితో పాటు అంజయ్యకు నటన అంటే ఎనలేని మక్కువ. సినిమాల్లో నటించాలన్నది అతని బలీయమైన కాంక్ష.

అంజయ్య పేద కుటుంబం నుంచి వచ్చాడు. యాభైఏళ్ళ అతని తండ్రి రోగగ్రస్తుడు. తల్లికి చదువురాదు. పెళ్లీడుకొచ్చిన ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. ఆ కుటుంబంలో అంజయ్య ఒక్కడే మగపిల్లాడు. పల్లెలో కొంతభూమి ఉంది. కుటుంబం మొత్తం అతను స్థిరపడటం మీద ఆధారపడివుందన్నమాట. అంజయ్య పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కోర్సు చేసేందుకు కుటుంబ ఆర్థికపరిస్థితులు ఏమాత్రం సహకరించవు. పైగా అతని అండ కుటుంబానికి చాలాచాలా అవసరమిప్పుడు.

అంజయ్యతో కౌన్సిలింగ్ ఇలా కొనసాగింది.

"మీరు నాకు సాయం చేయాలి డాక్టర్" అన్నాడు అంజయ్య.

"చెప్పండి. నా నుంచి ఎలాంటి సాయాన్ని కోరుకుంటున్నారు మీరు"

"నాకు సినిమా నటుడిని కావాలని చాలా బలమైన కోరిక ఉంది. నేను ఇంజినీరింగ్ పూర్తిచేశాను. నేను ఇక యాక్టింగ్ వైపు వెళ్ళవచ్చా? లేక ఇంజినీరింగ్‌లో పైచదువులకు వెళ్ళాలా?"

"సినిమా నటుడిని కావాలని బలమైన కోరిక మీలో ఉందని అంత కచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు"

"చిన్నప్పట్నుంచి సినిమాలు చూస్తున్నాను. సినిమాల పట్ల పూర్తి ఆకర్షితుడిని అయ్యాను. కొన్ని సినిమాలను మూడునాలుగుసార్లు కూడా చూసేవాడిని. నేను నటుడిని అవుతాను అన్న భావన నాకు కలుగుతుండేది"

"నటన విషయంలో ఎలాంటి కృషి చేశారు మీరు?"

"నటనకు సంబంధించి కరెస్పాడింగ్ కోర్సులు చాలానే చేశాను. చాలా సినిమాలు చూశాను. ప్రముఖనటుల నటనను గమనించాను. అలాగే నటించి చూపగలను కూడా"

"యాక్టింగ్ మీద అంత ప్రేమ ఉందా? అయితే ఇంజినీరింగ్ చదువును ఎదుకు ఎంపిక చేసుకున్నారు?"

"ఏదో ఒక ప్రొఫెషనల్ కోర్సు చేయాలి కదండీ. అలాచేస్తే మంచి ఉద్యోగం వస్తుంది కదా!"

"నేను మిమ్మల్ని నటన, లేదా ఇంజినీరింగ్ ఈ రెండింటిలో ఏదో ఒకటి మాత్రమే ఎంపిక చేసుకోండి అని అడిగితే ఏది కావాలనుకుంటారు?"

"ఇప్పుడైతే నటననే"

"అయితే నటనవైపే వెళ్ళండి. ఇంజినీరింగ్ చదువు గురించి మరిచిపోండి."

"అలాకుదరదు సార్, మా కుటుంబ ఆర్థికపరిస్థితి బాగులేదు. నేను వెంటనే సంపాదనమొదలుపెట్టి తీరాలి"

"అయితే ఉద్యోగం కోసం అప్లయ్‌చేయండి. నటన గురించి మరిచిపోండి"

"లేదు డాక్టర్. నాకు నటించాలని ఉంది. ఎం.టెక్. చదవాలని కూడా ఉంది."

"అయితే రెండు చెయ్యండి"

"కాదు డాక్టర్... నేను మీ అభిప్రాయాన్ని కోరుకుంటున్నాను"

"నాకు కరెక్ట్ చెప్పండి. అసలు ప్రత్యేకించి ఏదైన పథకం కానీ ప్రణాళిక కానీ మీరు సిద్ధం చేసుకున్నారా?"

"నేను ఎం.టెక్. ఎంట్రెన్స్ రాస్తాను. సీటు వస్తుంది. స్టయిఫండ్ కూడా వస్తుంది. రెండు నెలల తర్వాత నేను ఎం.టెక్. కోర్సును డిస్‌కంటిన్యూ చేస్తాను. చెన్నయ్‌కు వెళతాను. సినిమాల్లో వేషాలకోసం ప్రయత్నిస్తాను. సినిమా వేషం దొరికిందనుకోండి నేను కచ్చితం పాపులర్ అవుతాను. అక్కడే ఉండిపోతాను. లేదనుకోండి చెన్నయ్ వదిలేసి వచ్చేస్తాను. నా చదువును కొనసాగిస్తాను. ఒకసారి ఎం.టెక్.లో సీటు వస్తే నాలుగేళ్ళపాటు ఉంటుంది."

"మీ ఆలోచన అద్భుతంగా ఉంది. మీకు కుటుంబబాధ్యతలు అంటూ ఏవైనా ఉన్నాయా? మీ కుటుంబం దగ్గర చాలినంత డబ్బు ఉందా? మీ ప్లాన్‌కు వారు మద్దతివ్వగలరా?"

"నో డాక్టర్. మా కుటుంబంలో నేనొక్కడినే కొడుకును. పెళ్లీడుకొచ్చిన ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. చాలా సాధారణ కుటుంబం మాది. నా చెల్లెళ్ళకు పెళ్ళి చేయాలన్న నా సంపాదనే కావల్సివుంది. మానాన్న ఆనారోగ్యంతో బాధపడుతుంటారు"

"సినిమాల్లో నటించాలన్న మీకోరిక మెచ్చుకోదగ్గదే. అలాగే ఇంజినీరింగ్‌లో పెద్ద చదువు చదవాలన్న కోరిక కూడా. మీకుటుంబపట్ల మీబాధ్యత కూడా నాకు అర్థమయింది. మీరు చేయాలనుకుంటున్న పనులన్నీ ఒకేసారి జరిగిపోయేందుకు ఏదైనా మార్గం ఉందా?"

"లేదు డాక్టర్. అయితే నేను నా క్లాసుమేటును ప్రేమిస్తున్నాను. ఆమె ధనవంతురాలు. అయితే మా కులం కాదు. వేరే కులం అమ్మాయి. ఆమె కూడా నేనంటే ఇష్టపడుతోంది. వాళ్ళ కుటుంబం కూడా నేనంటే ఇష్టపడుతోంది. మా వాళ్ళకు ఈ విషయం తెలియదు. అమ్మాయి వాళ్ళు పెళ్లి చేసుకొని వారితో పాటే ఉండిపొమ్మని చెబుతున్నారు. మా చెల్లెళ్ళ పెళ్లిళ్ళకు కూడా ఆర్థికంగా సాయం చేస్తామంటున్నారు. అయితే వాళ్ళు చెప్పేదంతా మొదట నువ్వు పెళ్ళి చేసుకో. ఆ తర్వాత కావల్సినంత సాయం మేం చేస్తామనే"

"అంజయ్య నేనో విషయం చెబుతాను. అది నిన్ను హర్ట్ చేయవచ్చు. మీ గురించి నేను చెప్పే విషయాలను మీరు జీర్ణించుకోగలరా?"

"చెప్పండి డాక్టరుగారు"

(ఇంకావుంది)